# అమెరికనే అల్లుడు

తెలుగు కళాసమితి న్యూజెర్సీ- రాజాలక్ష్మీ ఫౌండేషన్ వారి కథల పోటీలో బహుమతి పొందిన కథ

ఓ. కామేశ్వరి

**కాత్యాయని ఈ ఏడాది ఎలాగన్న కూతురి పెళ్ళి చేసేయాలని పట్టుదలగా వుంది.**

ప్రతీక్ష ఎం.బి.బి.ఎస్. పరీక్షలయి వస్తూంది. మళ్ళీ యింటర్నల్ షిప్ మొదలయ్యేలోగా ఇండియా వెళ్ళి పెళ్ళిచేసి తీసుకు రావాలని ఆరాటం పడ్తోంది. కూతురి పెళ్ళి విషయం భార్య మీద వదిలేశాడు డాక్టర్ మూర్తి.

ఆయనకి ఇల్లు, హాస్పిటల్ తప్ప మరో లోకం లేదు. ఏనాడో యింటి బాధ్యత, పిల్లల బాధ్యత కాత్యాయని మీద వదిలేశాడు ఆయన. కూతురికి యిరవైమూడు నిండుతున్నాయి. ఇప్పుడు గనక అవకపోతే మళ్ళీ మూడేళ్ళ వరకు హౌస్‌సర్జన్సీ (యింటర్నల్స్) అయ్యేవరకు దానికి తీరికుండదు అని ఆవిడ తొందరపడ్తూంది. ఇండియా నించి అన్నగారు సూచించిన కొన్ని సంబంధాలలో కాత్యాయనికి రెండు మూడు బాగా నచ్చాయి. యిద్దరబ్బాయిలు డాక్టర్లు, ఒకడు ఇంజనీరు. కుటుంబాలు మంచివి. తమ హోదాకి సరిపోయినవి. అబ్బాయిలూ స్మార్ట్‌గానే వున్నారు. ఈ మూడింటిలో కూతురికి ఏది నచ్చితే అది చేసేయాలి అని ఆవిడ ఉద్దేశం. తాము అమెరికన్ సిటిజన్స్ కనక డాక్టరు చదివిన అబ్బాయిలు యిలాంటి సిటిజన్‌షిప్ వున్న అమ్మాయిలని పెళ్ళాడి అమెరికా రావాలని ఆరాటం పడ్తూంటారు గనక తన కూతురికి అనేక సంబంధాలు వచ్చాయి-ప్రతీక్ష అందగత్తె కాకపోయినా చక్కని కనుముక్కుతీరు, స్మార్ట్ అండ్ ఇంటిలిజెంట్ గర్ల్-యిక్కడ డాక్టరు సీటు దొరికిందంటేనే ఆ సంగతి తెలుస్తుంది. తన కూతురి విషయంలో అబ్బాయిలకుతన కూతురు నచ్చడం కాదు తన కూతురు వాళ్ళకూనచ్చాలి-ముందు తామిద్దరూ వెళ్ళి ఏదో ఒక సంబంధం ఫిక్స్ చేసి ఫోను చెయ్యగానే భర్త, కొడుకు ప్రతీక్ వచ్చేట్టు ఏర్పాటు చేసి ఇండియాకి టిక్కెట్టు కూడా బుక్ చేసేసింది కాత్యాయని.

కూతురు శలవలకి రాగానే రాత్రి ఇండియా ప్రయాణం విషయం ఎత్తింది. ఇన్నాళ్ళూ కూతురెక్కడ ఏ అమెరికన్నో, యింకెవర్నన్నా చేసేసుకుంటుందేమోనన్న భయం కాత్యాయనికి వున్నా మెడిసన్ కాకుండా ఎలా చెయ్యడం అని ఆలోచించింది. చెప్పినా చదువు మధ్యలో కూతురు వప్పుకోదనీ తెల్సుగనక కూతురు అలాంటి పని యిప్పటి వరకు చెయ్యనందుకు దేముడికి నమస్కారం పెట్టుకుంది- పిల్లలు అమెరికాలో పుట్టి, పెరిగినా వాళ్ళని ఇండియన్స్‌గానే పెంచారు కాత్యాయనీ, మూర్తీ-యింట్లో తెలుగు మాట్లాడడం, వీలయినప్పుడల్లా పిల్లలని ఇండియా తీసికెళ్ళడం, తెలుగు పాటలు, తెలుగు సినిమా క్యాసెట్లు చూపడం, యింట్లో పూజలు, వ్రతాలు, పండుగలు, పట్టు చీరలు, తెలుగు పిండివంటలు అన్నీ చేస్తూ అమెరికాలోవున్నా తెలుగు జీవితమే పిల్లలకి చూపించారు-అయితే అక్కడే పుట్టి అక్కడే చదువుతున్న వాళ్ళకి ఆ భాష, ఆ దేశం, ఆ స్నేహితులు, ఆ ఇన్‌ఫ్లూయన్స్ తప్పనిసరి అవుతుంది గనక పిల్లలు బయట అమెరికన్స్‌లాగ, యింట్లో ఇండియన్స్‌లాగే ప్రవర్తించేవారు. కూతురుకి పెళ్ళీడుకొచ్చాక తమ మాట కాదనదన్న ధైర్యంతోనే కూతురిని సంప్రదించకుండానే పెళ్ళికొడుకుల వేట మొదలుపెట్టి, పెళ్ళి చూపులవరకూ ఏర్పాటు చేసింది కాత్యాయని. తల్లి అందించిన ఫోటోలు చూసి, చెప్పింది విని ప్రతీక్ష తెల్లపోయింది. తన వెనక, తనకు చెప్పకుండానే యిన్ని ప్రయత్నాలు చేసిన తల్లికి తన మనసులో మాట చెప్పే సమయం వచ్చిందని గ్రహించి చెప్పేసింది. కూతురు అతి మామూలుగా చెప్పిన మాట కాత్యాయనికి నెత్తిన పెద్ద బాంబు బద్దలయినంత షాకు, ఒకరకం అచేతన స్థితి కల్గించింది. కళ్ళు పెద్దవి చేసి మాటరాక అలా వుండిపోయింది రెండు నిముషాలు "ఏమిటీ...నీవు...నీవు, ఆ మైక్‌ని పెళ్ళాడుతావా...వాడు...వాడు...అండర్ గ్రాడ్యుయేట్, డిపార్ట్‌మెంటల్ స్టోర్సులో పనిచేసే మైక్‌ని పెళ్ళాడతావా!!"నోట్లోంచి మాటలు పెగుల్చుకుని అనగలిగింది ఆఖరికి.

"ఏమిటి మమ్మీ...వాట్సరాంగ్ విత్ యూ" చాలా తేలిగ్గా అంది ప్రతీక్ష తల్లి వంక చూసి. "నేనేదో అంతరిక్షానికి వెడతానన్నంత షాక్ అయ్యావు... మైక్‌ని పెళ్ళాడుతానంటే. అతనేదో మనిషికాదు అన్నంత బెంబేలు పడ్తున్నావు...వాట్సరాంగ్ విత్ హిమ్...".

కాత్యాయని మొఖం కోపంతో ఎర్రబడిపోయింది. మాట వణికింది. "వాట్స్ రాంగా! యింకా అడుగుతున్నావా...వాడు...వాడు...అతను ఇంత చదివి...చదువు సంధ్యలేని, ఓ కొట్లో లెక్కలు రాసేవాడిని...అప్టరాల్ వారానికో వందో రెండు వందల డాలర్లు సంపాదించే వాడిని చేసుకుంటానంటూ యింకా వాట్స్ రాంగ్ అంటావా...మనం ఇండియన్స్ అతను అమెరికన్ అన్నది అటుంచి, అన్నీ వుండి...ఓ చదువు సంధ్యలేనివాడిని చేసుకుంటానంటావా..." కోపంతో మాటలు తడబడ్డాయి.

"ఏమిటి మమ్మీ..మైక్ ఇంజనీరింగులు, డాక్టరులు చదవకపోవచ్చు-హి యీజ్ ఏన్ ఎడ్యుకేటెడ్, కల్చర్డ్ పెర్సన్, నమ్ హౌ ఐ లైక్ హిమ్"...గోళ్ళు ట్రిమ్ చేస్తూ నిమ్మకు నీరెత్తినట్టు అంది

* తన గర్ల్‌ఫ్రెండ్ పుట్టినరోజునాడు ఓ తెల్లగులాబీ తీసుకొచ్చాడు కిషోర్.
"అబ్బా ఎంత బాగుందో" అని కిషోర్ బుగ్గమీద ఓ ముద్దిచ్చింది కవిత.
వెంటనే వెనుదిరిగాడు కిషోర్.
"ఏమిటి వెళ్ళిపోతున్నావు? ముద్దు బాలేదా?" అడిగింది కవిత.
"బాగుంది. మళ్ళీ ఓ వంద తెల్లగులాబీలు తెద్దామని" చెప్పాడు కిషోర్.
— గొల్లపూడి శైలజ



ప్రతీక్ష.

తరువాత కాత్యాయని ఎంత గొడవ చెయ్యాలో అంత చేసింది. నెత్తి నోరు



కొట్టుకుంది. "నీకిదేం ఖర్మ, రాత" అంటూ బెంబేలు ఎత్తిపోయింది... మంచిగా చెప్పింది-అరిచింది-తిట్టింది. ముందెందుకు చెప్పకుండా దాచావు అని ఎగిరింది. "ఏదో నీ ఫ్రెండు సుజాన్ అన్నయ్య చిన్నతనం నించి అంతా ఫ్రెండ్స్, కల్సి తిరుగుతున్నారు అనుకున్నాంగాని నీవింత పనిచేస్తావా, ఆ పనికిమాలిన వాడిని కట్టుకుని ఏం సుఖపడ్తావే, అమెరికన్ అయినా పోనీ చదువు ఉద్యోగం వున్నవాడైతే పోనీ అనుకునేవాళ్ళం, మన స్టేటస్ ఏమిటి, వాడు మా అల్లుడవుతే తల ఎలా ఎత్తుకు తిరగగలమే... పోనీ మా సంగతి అలా వుంచు. నీవెలా బతుకుతావే...ఇన్నాళ్ళు యీ విషయం దాచి మమ్మల్నిలా మోసం చేస్తావా, ఎన్నాళ్ళనించే యిదంతా జరుగుతూంది.!! ఆగకుండా అరిచింది కాత్యాయని. తల్లి అరిచినంతసేపూ వూరుకుంది. "మమ్మీ-నీవెంత అరిచినా నా నిర్ణయం మారదు-నాకు మైక్ అంటే చిన్నప్పట్నించీ యిష్టం. అతను అట్టే చదువుకోకపోవచ్చు-కాని అతనంత వెల్ మేనర్డ్ మగాడ్ని నేనింతవరకు చూడలేదు-వాళ్ళు మనంత గొప్పవాళ్లు కాకపోవచ్చు-కాని సంస్కారం గౌరవ మర్యాదలున్న కుటుంబం. అతను నేనంటే ప్రాణం యిస్తాడు. అతనాట్టే సంపాదించలేదు నిజమే. కాని డాక్టరునయి నే సంపాదిస్తాను కనక మా సంసారానికేం లోటుండదు. ఇన్నాళ్ళు మీకెందుకు చెప్పలేదంటే నా మెడిసన్ అయ్యాకగాని పెళ్ళిచేసుకోం, మీరెలాగూ అంగీకరించరు. అప్పుడు నాకు ఆర్థిక స్వాతంత్ర్యం వుంటుంది గనక పరవాలేదని ఆలోచించాను. నీవు నాకు సంబంధాలు చూస్తున్నట్టు చెప్పివుంటే అప్పుడే వద్దని చెప్పేదాన్ని అంచేత నన్ను బ్లేమ్ చేయకు" అని చెప్పదలచింది అయిపోయినట్టు అక్కడినించి వెళ్ళిపోయింది ప్రతీక్ష-రాత్రి భర్త చేత చెప్పించింది. తల్లి తండ్రి ఎన్ని విధాలుగా చెప్పినా ప్రతీక్ష పట్టుదల విడవలేదు-ఆఖరికి కూతురి అభీష్టానికి తలఒగ్గక తప్పలేదు ఆ తల్లి తండ్రికి.

* * *

ప్రతీక్ష పెళ్ళయి ఆరేళ్ళు అయింది. నాలుగేళ్ళ కూతురు, రెండేళ్ళ కొడుకు-పిల్లలిద్దరు తండ్రి రంగుతో, పోలికలతో చాలా అందంగా వుంటారు. మనవలంటే ప్రాణం కాత్యాయనికి. ప్రతీక్ష డాక్టరయి రెండు చేతులతో సంపాదిస్తూంది. బోస్టన్‌లో నాలుగు బెడ్ రూముల ఇల్లు కింద బేస్‌మెంట్, గార్డెను, రెండు కార్లు, స్విమ్మింగ్ పూల్, దేనికీ లోటు లేదు ప్రతీక్షకి-కూతురు కాపురం చూసి యిప్పుడు కాత్యాయనికి ఏ బాధ లేదు.

మొదట ఓ రెండు మూడేళ్ళు కాత్యాయనికి వీళ్ళు ఏదో ప్రేమ అనుకుని మోజులోపడి పెళ్ళి చేసుకున్నారుగాని, వీళ్ళు ఎన్నాళ్ళు కాపురం చేస్తారు, కూతురు తనకంటె తక్కువ చదువు, సంపాదన వున్న మొగుడితో సర్దుకుంటుందా అన్న అనుమానం వుండేది. ఓ తల్లిగా కూతురు సంసారం చక్కగా వుండాలని వున్న అంతరాంతరాలలో ఎక్కడో మైక్‌తో విడిపోయి మంచివాడ్ని పెళ్ళి చేసుకుంటే బాగానే వుంటుంది...ఈ రోజుల్లో డైవోర్సులు, అందులో అమెరికాలో యివన్నీ ఎవరు పట్టించుకుంటారు అన్న ఊహ వుండేది అల్లుడంటే వున్న చిన్నచూపువల్ల.

కాని రోజులు గడుస్తున్న కొద్దీ మైక్ మంచితనం, సంస్కారం, ప్రతీక్ష పట్ల [illegible] ప్రేమ...ప్రతీక్ష ఆస్పత్రి పనులలో సతమతమవుతూంటే మగవాడ్ని అన్న అహంకారం లేకుండా యిల్లంతా తనే చక్కపెట్టుకుంటూ, వంట దగ్గరనుంచి అన్నీ తనే చూస్తూ ప్రతీక్షని పువ్వుల్లో పెట్టిపూజించడం చూసి ఆశ్చర్యంతోపాటు మనసులో అభినందించకుండా వుండలేకపోయేది. మొదట్లో చిన్న ఫ్లాట్‌లో వుండేవారు. తాము ఏది యిస్తానన్నా మర్యాదగా తిరస్కరించి ఒక్కొక్కటి వాళ్ళ సంపాదనతో అమర్చుకుని, నాలుగేళ్ళలో మంచి యిల్లు, కార్లు అన్నీ అమర్చుకున్న వాళ్ళని అభినందించుకుంది కాత్యాయని. పిల్లలు పుట్టి

కొచ్చాక మైక్ పగలంతా పిల్లలని ఏ ఆడవాళ్ళు చూసుకోనంత చక్కగా చూసేవాడు. పిల్లలకోసం బేబి సిటింగ్ చేయడానికి ఉద్యోగం మానేసాడు. ఆ యింట్లో ప్రతీక్ష మగాడిలా సంపాది స్తుంటే అతను యిల్లు నడిపేవాడు. ప్రతీక్ష రాత్రి యింటికి వచ్చేవరకు డిన్నరు కూడా తినకుండా ఎదురు చూసేవాడు. అలా అని ప్రతీక్ష భర్తని తక్కువ చేయడం, నిర్లక్ష్యంగా ప్రవ ర్తించడం, లోకువగా చూడడం కాత్యా యని ఎప్పుడూ చూడలేదు. ఉదయం లేచి బ్రేక్‌ఫాస్ట్ రెడీచేసి పిల్లలకి కావాల్సి నవి తయారుచేసి ఫ్రిజ్‌లో పెట్టి వెళ్ళేది ప్రతీక్ష- రాత్రి యింటికి వచ్చాక పిల్ల లని చూసుకునేది. వాళ్ళిద్దరి మధ్య అండర్‌స్టాండింగ్, అన్యోన్యత చూసి- ఒకోసారి ప్రతీక్ష ఇదే ఏ తెలుగబ్బా యినో చేసుకుంటే యింతలా మగాడి నన్న యిగో లేకుండా, ఆడపని మగపని అని కాకుండా ప్రతీక్షకి సాయపడేవాడా అనిపించింది. బట్టలు యిస్త్రీ దగ్గిర నుంచి, ప్లబింగ్, కార్పెంటరీ, గార్డెనింగు దగ్గరనుంచి అన్నీ చేసే మైక్‌ని చూసి నప్పుడల్లా అదే అనిపించేది కాత్యా యనికి. కూతురుకి వురుడు పోయ డానికి రావడం పేరుకి మాత్రమే. మిగతాదంతా తనని కూడా కూర్చో పెట్టి అల్లుడు చేస్తుంటే ఓ మూడేళ్ళ లోనే కాత్యాయని అల్లుడిపట్ల అభి ప్రాయం మార్చుకుని మైక్‌ని మనస్ఫూ ర్తిగా గౌరవించడం, అభిమానించడం నేర్చుకుంది.

* * *

ప్రతి ఏడు సమ్మర్‌లో ఒక నెల కూతు రింట్లో వుండడం అలవాటు కాత్యాయ నికీ, మూర్తికి- మనవలతో గడపడం కోసం డాక్టరు మూర్తి పనులన్నీ పక్క నపెట్టి వచ్చేవారు.

"మమ్మీ-ఇవాళ మా హాస్పటల్‌కి ఓ బర్న్ కేసు వచ్చింది. ఆ అమ్మాయి ఇండియన్, మన తెలుగు పిల్లే- పాపం పట్టుమని ముప్పైఏళ్ళు లేవు. సూయిసైడ్ కమిట్ చేసింది." రాత్రి డిన్నరు టేబిల్ దగ్గిర అంది ప్రతీక్ష.

"అయ్యో, ఎవరమ్మాయి, ఎందుకలా చేసింది యిక్కడేం చేస్తూంది, పెళ్ళ యిందా?" ఆరాటంగా ప్రశ్నలు కురి పించింది కాత్యాయని.

"పెళ్ళి కాక పోవడం ఏమిటి? యిద్దరు పిల్లలు కూడాను. ఆ మొగుడు, ఆ రాస్కెల్ ఆమె చావుకి కారణం. అమ్మాయి డాక్టరేట్. భర్తతో పడక, ప్రాణం విసిగి సూయిసైడ్ చేసుకుంది"

"డాక్టరయివుండి మొగుడితో పడక పోతే డైవర్సు తీసుకోకుండా చావడం ఏమిటి-పిచ్చిపిల్లలా వుంది. అమె రికాలో వుండి, చదువుండి కూడా యిలా చెయ్యడం ఏమిటి?"

"ఏం చేస్తుంది మమ్మీ-పెళ్ళయింద గ్గరనుంచి కాల్చుకు తినేవాడట. అమె రికాలో వున్నా అమలాపురంలోవున్న ఛాందసుడిలా బిహేవ్ చేస్తూ అడుగ డుగునా మగ అహంకారం చూపిస్తూ, తనకంటె ఆమె మంచి ఉద్యోగం, సంపాదన ఎక్కువ అన్న మగ ఇగోతో అనుక్షణం అనుమానాలతో ప్రాణాలు తీసేవాడట. వాడితో మాట్లాడావు, వీడితో నవ్వావు అంటూ యింట్లో చాకిరి అంతా ఆమే చెయ్యాలని నానా రకాలుగా పెట్టే హింసని భరిం చింది. ఆఖరికి ప్రాణం విసిగి డైవోర్స్ తీసుకుంటానంటే పిల్లలని యివ్వనని, డైవోర్సు యివ్వనని భయపెడితే ఆ బాధ భరించలేక ఆత్మహత్య చేసు కుంది-డైయింగ్ డిక్లరేషన్ యిచ్చింది చచ్చిపోతూ-వెధవకి జైలు ఖాయం"

"ఎవరా దరిద్రుడు-మన తెలుగు వాడంటున్నావు. మనకు తెల్సిన వాళ్ళా?"

ప్రతీక్ష నవ్వింది "ఎవడో కాదు మమ్మీ. నీకు అల్లుడు కావాల్సిన వాడు, నా అదృష్టంకొద్దీ వాడిపాలప డకుండా తప్పించుకున్నాను. నీవు అపు రూపంగా నా కోసం ఎంచిన డాక్టరు పెళ్ళికొడుకు-వాడ్ని చూడగానే అనిపిం చింది ఎక్కడో చూసినట్టు, వివరాలు తెలిశాక 'మైగాడ్'అనుకున్నాను."

కాత్యాయని మొహం తెల్లపడింది. కలవరంగా కూతురివంక చూసింది- తల్లి పాలిపోయిన మొహం చూసి ప్రతీక్ష నవ్వుతూ-"ఏమిటి మమ్మీ అలా అయిపోయావు, నీ కూతురు సూయి సైడ్ చేసుకుందన్నట్టు-వాడు నీ అల్లుడు కాదుగా, అల్లుడు కాబోయి తప్పిపోయినవాడు-"

"అసలు నన్నడుగుతే మన ఇండి యాలో ప్రతి అబ్బాయినీ ఓ ఏడాదీ రెండేళ్ళు అమెరికా పంపాలంటాను. ఇక్కడికి వచ్చి కష్టపడి చదువుకుంటూ తన పని తాను చేసుకుని, వండుకుని తిని 'డిగ్నిటీ ఆఫ్ లేబర్' అంటే అర్థం అయి ఆ 'మేల్ ఇగో' చావాలంటే ప్రతి అబ్బాయినీ ఇక్కడ ట్రైనింగ్‌కి అన్నట్టు పంపాలి. ఆడ మగ సమానం అన్నది అర్థం కావాలంటే యిక్కడొచ్చి వుండాలి. మన కుర్రాళ్ళకి ఉద్యోగానికి ముందు ఓ ఏడాది మిలట్రీ ట్రైనింగ్, పెళ్ళికి ముందు అమెరికా ట్రైనింగ్ యిప్పిస్తేగాని యీ మగాడి జులుంలు, ఇగోలు వదలవు-యీ విషయంలో మనం అమెరికన్సని చూసి ఎంతన్నా నేర్చుకోవాలి" ప్రతీక్ష అంటున్న మాట లకి అప్రయత్నంగానే తల ఆడించింది కాత్యాయని.

●●

# సి.నా.రె. ఛలోక్తులు



సేకరణ: డా.ఎన్. గోపి

**1974**లో హైదరాబాద్‌లో హిందీ ప్రేమీ మండలి అధ్య ర్యంలో సి.నారాయణరెడ్డిగారికి సన్మాన సత్కారం జరిగింది. ఆ సభలో ఓ వీరాభిమాని తాను సినారెకి ఏకలవ్య శిష్యుడనని హావభావ విన్యాసాల్తో వివరించి చెప్పాడు. అనంతరం ప్రసంగించిన సినారె "నన్ను చాలామంది అభిమానిం చడం నా అదృష్టం. అయితే నేను బొటనవేలు కోరని ద్రోణున్ని. శిష్యులను హింసించడం నా అభిమతం కాదు. మిత్రుడు ఏకలవ్యుడు అన్నాడు కాబట్టి నాకు కూడా వారిపట్ల 'ఏకలవ్' వుంది"అన్నారు. 'అభిమాని పట్ల ప్రేమైక దృష్టి నాది' అర్థాన్ని గర్భితంగా చెప్పిన సినారె సమయస్ఫూర్తికి సభికులు ఆనందించారు.

– జి. సాయివరప్రసాదరావు, తెనాలి

**డా.** సి. నారాయణరెడ్డిగారి స్వగ్రామం కరీంనగర్‌జిల్లాలోని హను మాజీపేట. ఆయన జ్ఞానపీఠ పురస్కారం వచ్చినప్పుడు హనుమాజీపేట ప్రజలు "మన ఊరికి ఇంత కీర్తి తెచ్చారు. ఈ ఊరికి మీ పేరు పెట్టాలని ప్రభుత్వానికి మహజరు సమర్పించుకుంటాము" అని అన్నారు. దానికాయనకు కోపం వచ్చింది. తర్వాత నిగ్రహించుకుని కాసేపు కళ్లుమూసుకుని, పెదవ విరుచుకుని చిరునవ్వుతో

"నాయనా, ఢిల్లీకి రాజైనా తల్లికి కొడుకే. తల్లి తల్లే. కొడుకు కొడుకే" అని వారి ప్రయత్నాన్ని సున్నితంగా నివారించారు. అక్కడున్నవారందరూ ఆయన వ్యక్తిత్వానికి ముగ్ధులయ్యారు.

– తీగల శ్రీనివాస్, హనుమాజీపేట

**1986**లో అలనాటి సుప్రసిద్ధ చలనచిత్ర హాస్య గాయ కులు మాధవపెద్ది సత్యం, పిఠాపురం నాగేశ్వరరావులకు రవీంద్రభారతిలో సన్మానం జరిగింది. సభకు అధ్యక్షత వహించిన డా. సి. నారాయణరెడ్డిగారు ఆ జంట గాయకుల గురించి ఎంతో ఆసక్తికరంగా మాట్లాడుతూ "వారు చిరంజీవులు, స్వరంజీవులు. ఇవాళ వెండితెర మరుగైనా గుండె మరుగుకారు" అనడంతో ఒక్కసారిగా సభలో హర్షం చప్పట్లరూపంలో.

– గాలి నాసరరెడ్డి, హైదరాబాద్